క్లుప్తంగా

వరి విత్తనాల పంపిణీ



వరి వత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

గొలుగొండ: లింగంపేట గ్రామ సచివాలయం పరిధిలో రైతులకు శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది కిషోర్, స్థానిక సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, సలాదులు ప్రసాద్, కవి, నాని, మరిసా దేవుడు,పెద్దాడ ప్రసాద్ పాల్గొన్నారు.

అపరాల సాగుకు మేలు చేసిన వర్షాలు



వి.సంతపాలెంలో సాగులో ఉన్న అపరాల పంట

కె.కోటపాడు : అడపాదడపా కురుస్తున్న వర్షాలు అపరాల సాగుకు మేలు చేసినట్టు రైతులు తెలిపారు. మినప, పెసర, నువ్వు, జనుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు. సాగు ప్రారంభంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా ఇటీవల కురిసిన వర్షాలతో పంటలకు ఊపిరి వచ్చింది. మండలంలో వారాడ, వి.సంతపాలెం, ఆర్.వై.అగ్రహారం, ఎ.కోడూరు, కొత్తఅగ్రహారం, సింగందొరపాలెం తదితర గ్రామాల్లో 100 ఎకరాల్లో ఈ అపరాల పంటలను రైతులు సాగుచేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాకవరపాలెం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని జంగాలపల్లి నుంచి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా రాచపల్లి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్‌నాయుడు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు తప్పవన్నారు.

కార్మికుల దీక్షకు సీఐటీయూ మద్దతు



దీక్షలో పాల్గొన్న కార్మికులు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకుడు రాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్మికులు జరుపుతున్న పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తోందని చెప్పారు.


పారదర్శకంగా భూ రికార్డుల నిర్వహణ



రెవెన్యూ డే కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ భుజంగరావు

కె.కోటపాడు : రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో పారదర్శకంగా భూ రికార్డుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ భుజంగరావు తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయాల్లో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. సిబ్బందితో రెవెన్యూ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



వీధి కాలువలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రోలుగుంట: మండలంలోని కుసర్లపూడిలో సచివాలయ, వైద్య సిబ్బంది సంయుక్తంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలు, వాటికి ఇరు పక్కలా ఉన్న తుప్పలను, కూడళ్లు, రోడ్డు పక్కన ఉన్న చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఈ పనులను పరిశీలించిన సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు పారిశుధ్య పనుల కోసం తన సొంత సొమ్మును కూడా ఖర్చు చేశారు.



పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు



కుసర్లపూడి వెళ్లే రహదారి

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న స్టూడెంట్స్
- దూరాభారంతో సతమతం
- అన్ని పంచాయతీలకు బస్సులు నడపాలని వినతి

అరకొర బస్సులు.. విద్యార్థులకు అవస్థలు

రోలుగుంట: ఆర్టీసీ అధికారులు అరకొరగా బస్సులు నడుపుతుండడంతో మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురుతున్నారు. ఉన్న రూట్లలో కూడా సమయానికి బస్సులు రాపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 500 మంది విద్యార్థులు నర్సీపట్నం, కొత్తకోట, చోడవరం, అనకాపల్లిల్లో గల జూని యర్, డిగ్రీ కాలేజీల్లో చదువుతున్నారు. మండల కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తకోట, 35 కిలోమీటర్ల దూరంలో గల చోడవరంలోని కాలేజీలకు రోజూ విద్యార్థులు వెళ్లడం పెద్ద సమస్యగా మారింది. మండలంలో 24 పంచాయతీలుండగా ఎక్కువ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. దీంతో వారంతా ఆటోలను, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తోంది. రెంటింపు చార్జీలు చెల్లించవలసిరావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

20 రూట్లు.. ఎనిమిదే బస్సులు

మండలంలో మొత్తం 20 రూట్లు ఉన్నాయి. అయితే కేవలం చోడవరం–నర్సీపట్నం రూట్‌లో ఎనిమిది బస్సులు తిరుగుతున్నాయి. ఈ రూట్‌లో కేవలం మూడు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. సుమారు 10 గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండే నర్సీపట్నం –కశిరెడ్డిపాలెం, నర్సీపట్నం వయా కొసర్లపూడి, పాపంపేట రూట్లలో ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. నర్సీపట్నం – కొంతలాం, నర్సీపట్నం –కశిరెడ్డిపాలెం, నర్సీపట్నం –కల్యాణపులోవ, నర్సీపట్నం వయా కొసర్లపూడి, పాపంపేట రూట్లలో కనీసం ఐదు బస్సులు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.

మూడు బస్సులు రద్దు

నర్సీపట్నం డిపో నుంచి కొత్తకోట మీదుగా కశిరెడ్డిపాలెం, కల్యాణపులోవ, కుసర్లపూడి , పాపంపేటకు బస్సులు నడిపేవారు. తరువాత రోడ్లు బాగులేవన్న నెపం, ఇతర కారణాలతో మూడు సర్వీసులను రద్దు చేశారు. అన్ని పంచాయతీలకు బస్సులు నడపడాలని మండల సమావేశాల్లో తీర్మానాలు చేస్తున్నా, నర్సీపట్నం డిపోమేనేజర్‌కు వినతులు అందజేస్తున్నా ఫలితం ఉండడం లేదు. విద్యార్థులతో పాటు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు, వ్యాపారులు బస్సులు లేక అవస్థలకు గురవుతున్నారు.

బస్ సౌకర్యం పునరుద్ధరించాలి



జె.నాయుడుపాలెం నుంచి నర్సీపట్నంలో కళాశాలకు వెళ్లాలంటే ఆటోలో కొత్తకోట వెళ్లి, ఆర్టీసీ బస్సు వచ్చేవరకూ వేచి ఉండి అక్కడ నుంచి కాలేజీకి వెళ్లాలి. తిరిగి వచ్చేటప్పుడు కొత్తకోటలో ఆటో కోసం చాలా సేపు వేచి చూడాలి. దీంతో గంటల కొద్దీ సమయం వృథా అవుతోంది. దూరాభారం కావడంతో సక్రమంగా కాలేజీకి వెళ్లలేకపోతున్నాం. గతంలో మా గ్రామానికి నర్సీపట్నం డిపో నుంచి బస్సు వచ్చేది. రద్దు చేసిన ఆ సర్వీస్‌ను పునరుద్ధరించాలి.

– వై.అనిత, డిగ్రీ విద్యార్థిని, జె.నాయుడుపాలెం,రోలుగుంట మండలం

కాలేజీకి వెళ్లాలంటే నరకయాతనే..



బస్ సౌకర్యం లేక కాలేజీకి వెళ్లేందుకు నరకయాతనకు గురతున్నాం. మా గ్రామం నుంచి కాలేజీకి వెళ్లాలంటే ముందుగా మండలం కేంద్రం రోలుగుంట, లేదా అనకాపల్లి రూట్‌లో సుబ్బారాయుడు పాలెంకు ఆటోలో వెళ్లాలి. పూర్తిగా ప్రయాణికులు ఎక్కితే గాని ఆటోలు బయలుదేరవు. దీంతో సమయానికి చేరుకోలేకపోతున్నాం. గతంలో కుసర్లపూడి గ్రామానికి ప్రైవేటు బస్సు, ఆర్టీసీ బస్సు కూడా వచ్చేవి. ప్రైవేటు బస్సు పోటీ కారణంగా ఆర్టీసీ సర్వీస్ రద్దయింది. తరువాత ప్రైవేటు బస్సును కూడా నిలిపివేశారు. మా గ్రామానికి ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చుక్కా అభిషేక్, విద్యార్థి, కుసర్లపూడి, రోలుగుంట

ప్రకృతి సాగులో పీఎండీఎస్‌పై అవగాహన అవసరం

చీడికాడ: ప్రకృతి సాగులో ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ (పీఎండీఎస్)పై ప్రతి రైతుకు అవగాహన అవసరమని ప్రాంతీయ విభాగం అధికారి ప్రకాష్ అన్నారు.శుక్రవారం ఆయన మండలంలోని పలుగ్రామాల్లోని పొలాల్లో పీఎండీఎస్‌లో వేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు ముందు తొమ్మిది రకాల విత్తనాలను భూముల్లో వేసి ఆ పంటను పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించవచ్చని చెప్పారు.దీని వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేలతో పాటు రైతు ఆరోగ్యమన్నారు.



సాగులో ఉన్న పొలాలను పరిశీలిస్తున్న ప్రకాష్

దేవరాపల్లి ఎంఈవో-1గా ఉమ బాధ్యతల స్వీకరణ



ఉమను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

దేవరాపల్లి: దేవరాపల్లి మండల విద్యాశాఖ అధికారి–1గా సీహెచ్. ఉమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా తాజాగా బదిలీపై వచ్చిన ఆమెకు ఎంఈవో–1 బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆమెను సత్కరించారు.

పాఠశాలల భవన నిర్మాణాలు సకాలంలో పూర్తికి కృషి

సమగ్ర శిక్ష డీఈఈ గణేష్

దేవరాపల్లి: మనబడి మన భవిష్యత్ కార్యక్రమంలో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని సమగ్ర శిక్ష డీఈఈ కర్రి గణేష్ తెలిపారు. మండలంలో జరుగుతున్న పలు పాఠశాలల భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.52 లక్షలతో అదనపు భవన నిర్మాణ పనులతో పాటు ఇదే ప్రాంగణంలో రూ.1.60 కోట్లతో చేపడుతున్న కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న బాలిక వసతి గృహ నిర్మాణ పనులను కూడా పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లకు సలహాలు, సూచనలు చేశారు. ఈయన వెంట స్థానిక సమగ్ర శిక్ష ఏఈఈ సంతోష్ ఉన్నారు.



బేతపూడిలో కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గణేష్, సంతోష్

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

కె.కోటపాడు : యోగాతో మానసిక ఒత్తిడి దూరం కావడంతో పాటు చదువు పట్ల ఏకాగ్రత పెరుగుతుందని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. కె.కోటపాడులో గల అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో శుక్రవారం యోగాసనాలు వేయించారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా విద్యార్థులతో యోగాసనాలను వేయించినట్టు ఖాసిమ్ తెలిపారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

‘యోగాంధ్ర’కు తరలింపు

మాడుగుల/మాడుగుల రూరల్: విశాఖలో శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి మండలం నుంచి 28 బస్సుల్లో 1400 మందిని శుక్రవారం తరలించారు. మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రెండు బస్సులు, గ్రామాల నుంచి 26 బస్సుల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులను తరలించారు. మండలం నుంచి విశాఖ బయలుదేరిన బస్సును స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు ప్రారంభించారు. మండలంలో నాలుగు పాఠశాలల నుంచి 280 మంది విద్యార్థినీవిద్యార్థులను తరలించినట్టు స్థానిక ఎంఈవో–2 బి.దేముడమ్మ శుక్రవారం తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కూడా తరలి వెళ్లినట్టు తెలిపారు.

బుచ్చెయ్యపేట : విశాఖలో శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి మండలం నుంచి ఎనిమిది హైస్కూళ్లకు చెందిన 720 మంది విద్యార్థినీ విద్యార్థులను శుక్రవారం ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. అలాగే మండలంలో 35 పంచాయతీల నుంచి 10 బస్సుల్లో నాయకులు, కార్యకర్తలను తరలించడానికి ఏర్పాట్లు చేయగా, విశాఖ వెళ్లడానికి ఎవరు ముందుకు రాలేదు.దీంతో రెండు బస్సుల్లో 87 మంది నాయకులు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులను యోగాంధ్ర కార్యక్రమానికి వినియోగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చోడవరం: మండలంలోని లక్కవరం గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీ భూపతి వేంకటేశ్వరస్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధి భూపతిరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఈనెల 22వ తేదీ వరకు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా అష్టోత్తర శత కలశాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, కృష్ణామాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు దేవి,భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 21వతేదీన స్వామివారి కల్యాణోత్సం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



అష్టోత్తర శత కలశాభిషేకం పూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చూపొద్దని, వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు.ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన నాతవరం మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సభ్యులు చర్చించారు.గతసమావేశంలో సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన వాటిలో ఎన్ని సమస్యలను పరిష్కరించారని ఎంపీపీ అధికారులను ప్రశ్నించారు.మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు తీరుపై శాఖల వారీగా చర్చించారు. యోగాంధ్ర కార్యక్రమం కోసం మండలం నుంచి పలు శాఖల అధికారులకు డ్యూటీ వేయడంతో సగానికి పైగా అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. పూర్తి స్థాయిలో అధికారులు లేకుండా సమావేశం నిర్వహించడం ఎందుకని పెదగొలుగొండపేట ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, సర్పంచ్ మిరపల వెంకటరమణ ప్రశ్నించారు. వరి విత్తనాలు పంపిణీ చేసేటప్పుడు ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం ఇవ్వలేదని పలువురు సభ్యులు తెలిపారు. 1064 రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయదంటూ ప్రచారం జరుగుతోందని, దీనిపై వ్యవసాయశాఖ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని రాజుపేట అగ్రహారం సర్పంచ్ గుడపర్తి అచ్చియ్యనాయుడు కోరారు. 22 నెలలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లించడం లేదని, గౌరవ వేతనం ఇవ్వలేని కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు ఏవిధంగా అందిస్తుందని ములగపూడి డి.యర్రవరం, పెదగొలుగొండపేట ఎంపీటీసీ సభ్యులు తమరాన లోవకృష్ణ, ఇనపసప్పల పుష్ప, టి.సత్యనారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న దానికి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న దానికి పొంతనలేకుండా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హౌసింగ్ లబ్ధిదారులకు ఒక్క పైసా చెల్లించలేదని నాతవరం సర్పంచ్ గొలగాని రాణి ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స ఎంపీడీవో కె.ఉషశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో 2025–26 సంవత్సరానికి ప్రవేశాల కోసం(రెండో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు జూలై 15 ఆఖరి తేదీ అని తెలిపారు. జూలై 17 ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు ఆఖరి తేది అని పేర్కొన్నారు. వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేకపోతే పేర్లు మెరిట్ లిస్ట్‌లో కనిపించవని ఆయన స్పష్టం చేశారు.

దుర్గా దేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

రావికమతం: కొత్తకోటలో కొలువైఉన్న దుర్గాదేవి అమ్మ వారి ఆలయ 15వ వార్షికోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి 108 లీటర్ల పాలతో మహాక్షీరాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న అప్పారావు, డి.జి.నాథ్

నర్సీపట్నం: విశ్రాంత హెచ్ఎం,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బలిరెడ్డి అప్పారావు మున్సిపాలిటీలో శివపురం మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రూ.20 వేల విలువ చేసే నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అప్పారావుతో పాటు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.సాంబరాజు, చైర్మన్ జాన్, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి జి.వి.రమేష్, ఉపాధ్యాయులు ఇంద్రావతి, సరస్వతి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల3 వరకు సికిల్‌సెల్ నిర్ధారణ పరీక్షలు



కోనాంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ: మండలంలోని కోనాం,శిరిజాం సచివాలయాల పరిధిలో గల అన్ని గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సునీల్ తెలిపారు. కోనాంలో శుక్రవారం సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకూ 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పరీక్షలు జరుపుతున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దేశ గౌరవం పెరిగేలా మోదీ పాలన



బుచ్చెయ్యపేటలో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

బుచ్చెయ్యపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారం చేపట్టి 11 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో బీజేపీ నాయకులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభ నిర్వహించి, స్వీట్లు పంచిపెట్టి, సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ గౌరవం పెరిగేలా మోదీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సీతా నాగరాజు,మండల కార్యదర్శి దొండా నానాజీ,కో కన్వీనర్ ఈశ్వర ప్రసాద్,యూత్ సంఘ నాయకుడు ఎస్.మణికంఠ పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

మాడుగుల రూరల్: వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మృగశిర కార్తె ప్రారంభం నుంచి వరి నారు వేసేందుకు మడులు సిద్ధం చేస్తున్నారు. వరి విత్తనాల కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

మెయిన్ రోడ్డులో గోతులు పూడ్చివేత

చోడవరం: మెయిన్‌రోడ్డుపై గోతులను ఎట్టకేలకు పూడ్చారు. నిధులు మంజూరైనా సదరు కాంట్రాక్టర్ బీఎస్‌రోడ్డు పనులు చేపట్టకుండా వదిలేయడంతో రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చింది. చోడవరం కోర్టులో సైతం ఈ రోడ్డు దుస్థితిపై సుమోటాగా కేసు నమోదు చేసేందుకు యోచిస్తున్న సమయంలో ఎట్టకేలకు గోతులను పూడ్చారు.